
సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం। 19। ఫిబ్రవరి। 2025



నేటి నుంచి స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు

భువనగిరి శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. - 8లో



బీటీ మరిచారు

ఆత్మకూరు(ఎం) మండలంలోని తుక్కాపురం స్టేజీ నుంచి కప్రాయపల్లి వరకు చేపట్టిన బీటీ పనులు నిలిచిపోయాయి. - 9లో



రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. - 9లో

పల్లె జనం.. మన బలం!

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక జనాభా ఉన్నది నల్లగొండ జిల్లాలోనే

- ఆరేళ్లలోపు పిల్లలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో ఐదో స్థానంలో నల్లగొండ
- రానున్న రోజుల్లో మరింత తగ్గనున్న మహిళల సంఖ్య
- ఉమ్మడి జిల్లాలో కార్మికులు 80 శాతానికిపైగానే..
- ఇల్లాలి చదువు అంతంతే.. యాదాద్రి జిల్లాలో కాస్త ఎక్కువ
- చిరుధాన్యాల ఉత్పత్తిలో అగ్రస్థానం

అర్థగణాంక శాఖ నివేదికలో వెల్లడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా అత్యధికంగా పల్లె జనంతో పరిఢవిల్లుతోంది. రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలతో పోల్చితే నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా 12,50,113 మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అర్థగణాంక శాఖ సోమవారం విడుదల చేసిన స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ – 2024 ఈ లెక్కలను తేల్చింది. నల్లగొండ జిల్లాలో మొత్తం 16,18,416 మంది జనాభా ఉండగా, అందులో గ్రామీణ ప్రాంతాల్లో 12,50,113 మంది ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 3,68,303 మంది ఉన్నారు. ఆ తరువాత స్థానంలో నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి.

ఆరేళ్లలోపు పిల్లలు ఎక్కువే..



నల్లగొండ జిల్లాలో ఆరేళ్లలోపు పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఆరేళ్లలోపు పిల్లలున్న జిల్లాలో మొదటి స్థానంలో హైదరాబాద్ ఉండగా, రెండో స్థానంలో రంగారెడ్డి, మూడో స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉంది. నాలుగో స్థానంలో సంగారెడ్డి ఉండగా, 1,81,996 మంది పిల్లలతో నల్లగొండ ఐదో స్థానంలో ఉంది. ఇక యాదాద్రి జిల్లాలో 79,603 మంది ఆరేళ్లలోపు పిల్లల ఉండగా, సూర్యాపేట జిల్లాలో 1,10,136 మంది ఉన్నారు.

ఇళ్లు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో నాలుగోస్థానం



రాష్ట్ర వ్యాప్తంగా నివాసాలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో నల్లగొండ నాలుగో స్థానంలో ఉంది. ఎక్కువ ఇళ్లు ఉన్న జిల్లాల్లో మొదటి స్థానంలో హైదరాబాద్, రెండో స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి, మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లా ఉంది. 4,01,728 ఇళ్లతో నల్లగొండ నాలుగో స్థానంలో నిలిచింది. ఇక యాదాద్రి జిల్లాలో 1,88,520 ఇళ్లు ఉండగా, జనాభా 7,70,833 మంది ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 2,85,691 ఇళ్లు ఉండగా, జనాభా 10,99,560 మంది ఉన్నారు.

అధిక మొత్తంలో వృద్ధాప్య పెన్షన్లు

నల్లగొండ జిల్లాలో 77,525 మంది, యాదాద్రి జిల్లాలో 40236 మంది, సూర్యాపేట జిల్లాలో 57689 మంది వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నారు. ఉపాధి హామీ కూలీలు ఇతర జిల్లాలతో పోల్చితే రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో అత్యధికంగా ఉన్నారు.

158.65 లక్షల మంది బస్సుల్లో ప్రయాణం

జిల్లాలో గతేడాది జనవరి నుంచి మార్చి వరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలు నల్లగొండ జిల్లాలో రూ.72.24కోట్ల విలువైన రాయితీని 158.65 లక్షల మంది బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా పొందారు.

సగానికంటే ఎక్కువ మంది కార్మికులే..



నల్లగొండ జిల్లాలో కార్మికులు 8,06,091 (85.8 శాతం) మంది ఉండగా, అందులో వ్యవసాయం చేసే వారు 1,58,951 (19.7 శాతం) ఉన్నారు. యాదాద్రి జిల్లాలో 3,05,883 (81.8 శాతం) మంది, ఉండగా అందులో వ్యవసాయం చేసే వారు 67.500 మంది(18 శాతం) ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 4,95,764 (88.3 శాతం) మంది కార్మికులు ఉండగా, అందులో వ్యవసాయం చేసే వారు 98,773 (17.6 శాతం) మంది ఉన్నారు.

మహిళా అక్షరాస్యతలో ఉమ్మడి జిల్లా వెనుకంజ



మహిళా అక్షరాస్యతలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వెనుకంజలోనే ఉంది. నల్లగొండలో మొత్తం అక్షరాస్యత 63.8 శాతం ఉంటే అందులో పురుషుల అక్షరాస్యత 73.9 శాతం ఉండగా, మహిళల అక్షరాస్యత 53.5 శాతం ఉంది. సూర్యాపేట జిల్లాలో 64.1 శాతం అక్షరాస్యులు ఉంటే పురుషులు 73.4 శాతం, మహిళలు 54.9 శాతం ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 65.2 శాతం అక్షరాస్యులు ఉంటే పురుషులు 75.5 శాతం ఉండగా, మహిళలు 54.8 శాతం ఉన్నారు.

భువనగిరిలో స్కూళ్లు తక్కువ.. విద్యార్థులు ఎక్కువ



నల్లగొండ జిల్లాలో 2018 పాఠశాలలు ఉండగా, ఒక్కో స్కూల్లో సగటున 118 మంది విద్యార్థులు చదువుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 1266 పాఠశాలలు ఉంటే ఒక్కో స్కూల్లో సగటున 109 మంది విద్యార్థులు చదువుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 904 పాఠశాలలు ఉండగా, ఒక్కో స్కూల్లో సగటున 121 మంది విద్యార్థులు చదువుతున్నారు.

రహదారుల్లోనూ టాప్ నల్లగొండనే..



రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర, పంచాయతీరాజ్ రోడ్లలో అత్యధికంగా 9,013 కిలోమీటర్లు నల్లగొండ జిల్లాలోనే ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 3,904 కిలోమీటర్లు, సూర్యాపేట జిల్లాలో 3,832 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి. ఇక 4,497 కిలోమీటర్ల జాతీయ రహదారుల్లో 32 శాతం ఆరు జిల్లాల్లో ఉండగా, అందులో నల్లగొండ జిల్లాలో 273 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి.

వాహన రిజిస్ట్రేషన్లు అధికం

వాహనాల రిజిస్ట్రేషన్‌లో నల్లగొండ రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 31,085 వాహనాలు రిజస్టర్ అయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 16,031 వాహనాలు, సూర్యాపేట జిల్లాలో 20,913 వాహనాలు రిజస్టర్ అయ్యాయి.



తలసరి ఆదాయం ఇలా..

నల్లగొండ	2,62,619
సూర్యాపేట	2,30,950
యాదాద్రి భువనగిరి	2,58,801



2023–24లో రాష్ట్ర తలసరి ఆదాయం 3,56,564 కాగా.. నల్లగొండ జిల్లా తలసరి ఆదాయం 2,62,619 గా ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో తలసరి ఆదాయం 2,58,801గా ఉంది. సూర్యాపేట జిల్లాలో 2,30,950గా నమోదైంది. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే మూడు జిల్లాల్లోనూ తలసరి ఆదాయం పెరిగింది.

భవిష్యత్తులో మరింతగా తగ్గనున్న మహిళలు

నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ప్రతి వేయి మంది పురుషులకు 978 మంది మహిళలు ఉండగా, ప్రస్తుతం ఉన్న బాలుర సంఖ్యతో బాలికలను పోల్చితే ఆ సంఖ్య 917కు తగ్గనుంది. సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం వేయి మంది పురుషులకు 996 మంది మహిళలు ఉండగా, ప్రస్తుతం ఉన్న బాలుర సంఖ్యతో పోల్చితే అది 935కు తగ్గనున్నట్లు సర్వే తెలిపింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో వేయి మంది పురుషులకు 974 మంది మహిళలు ఉండగా, ప్రస్తుతం ఉన్న బాలుర సంఖ్యతో పోల్చితే అది 922కు తగ్గనున్నట్లు వివరించింది. ఎస్సీల్లో మాత్రం పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ప్రతి వేయి మంది పురుషులకు నల్లగొండలో 1007 మంది, సూర్యాపేటలో 1014 మంది మహిళలు ఉన్నారు.

నేరెడుగొమ్ము, గట్టుప్పల్‌లో తక్కువ వర్షపాతం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడాది కాలంలో తక్కువ వర్షపాతం నేరెడుగొమ్ము మండలంలో 310.9 మిల్లీమీటర్లు నమోదైంది. గట్టుప్పల్ మండలంలో 331.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మర్రిగూడ, నారాయణపూర్ మండలాల్లో అతితక్కువగా 34 రోజులే వర్షాలు కురిశాయి.

ధాన్యం ఉత్పత్తిలో టాప్



ధాన్యం ఉత్పత్తిలో నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 260.88 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కాగా అందులో నల్లగొండలో 5.2 శాతం, నిజామాబాద్‌లో 5.6 శాతం ధాన్యం ఉత్పత్తి అయింది. పప్పులు, చిరుధాన్యాల ఉత్పత్తిలో ఈ రెండు జిల్లాలే అగ్రస్థానంలో నిలిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా 207.93 లక్షల టన్నులు ఉత్పత్తి కాగా, అందులో నల్లగొండలో 6.55 శాతం, నిజామాబాద్‌లో 7.96 శాతం ఉత్పత్తి అయ్యాయి. పత్తి, బత్తాయి సాగులోనూ నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉంది. చేపలు, రొయ్యల ఉత్పత్తిలోనూ నల్లగొండ కీలక భూమిక పోషిస్తోంది. రాష్ట్రం మొత్తంలో ఉత్పత్తిలో నల్లగొండ నుంచే 6.8 శాతం ఉత్పత్తి అవుతున్నాయి.

న్యూస్‌రీల్

తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక కార్యాచరణ

భువనగిరిటౌన్: వచ్చే వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నిరంతరం నీటిని అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. నీటి ఎద్దడి సమస్యపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభా రాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు, పక్కన డీసీపీ రాజేష్‌చంద్ర

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నుంచి ప్రారంభంకానున్న స్వర్ణ దివ్య విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు సోమవారం పోలీసు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట కింద హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను సీపీ పరిశీలించారు. మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను వివరించారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ఎస్‌ఓటీ డీసీపీ రమణారెడ్డి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, పట్టణ సీఐ రమేష్ తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు(ఎం): విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలనే ఉద్దేశంతోనే కలాం స్ఫూర్తి యాత్ర కొనసాగిస్తున్నట్లు ఎడోడ్‌వాజ సీఈఓ మధులాష్‌బాబు తెలిపారు. ఎడోడ్‌వాజ బృందం సభ్యుల సహకారంతో చేపట్టిన కలాం స్ఫూర్తి యాత్ర మంగళవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, త్రీడీ ప్రింటింగ్, రోబో టిక్స్, మెషిన్ లెర్నింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహదేవరెడ్డి, యాత్ర బృందం ట్యూటర్లు అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయిసుబ్రహ్మణ్యం, రోహిత్ జలగాం, పైలట్ రమేష్ పాల్గొన్నారు.



రోబో టిక్స్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న సీఈఓ మధులాష్‌బాబు

సంత్ సేవాలాల్ ఆశయాలు సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు



సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా మంగళవారం భువనగిరి పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ బంజారాలకే కాకుండా అందరికీ మార్గదర్శకమన్నారు. అంతకు ముందు సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, టీఎన్‌జీవోస్ కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో వర్క్‌షాపు

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో మెడిసిన్ అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్‌జెండర్ హెల్త్ ఇన్ ఇండియా సహకారంతో మంగళవారం జెండర్ అఫిర్మేటివ్ కేర్ సెన్సిటైజేషన్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాన్స్‌జెండర్ల చట్టాలు, వారి మానసిక ఆరోగ్యం, జెండర్లలో జరుగుతున్న వైద్య శస్త్ర చికిత్స, సర్జరీలపై చర్చించారు. వైద్యపరంగా జెండర్ల సంరక్షణ, సహాయక బృందాలకు సంబంధించి ప్రశ్నోత్తరాల సెషన్‌ను వర్క్‌షాపులో నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, రిసోర్స్ పర్సన్ కన్మణి, డాక్టర్ రామకృష్ణన్, రాబర్ట్‌దేవి, నాయక్, ముకుంద మాలా లింగం తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవానికి సిద్ధం

- నేటి నుంచి 23 వరకు స్వర్ణ విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ
- ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- పంచకుండాత్మక యాగం నిర్వహించనున్న అర్చకులు



సంప్రోక్షణకు సిద్ధమవుతున్న స్వర్ణ విమాన గోపురం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి సిద్ధమైంది. బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పంచ కుండాత్మక మహాయాగం జరిపించి, స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహించి శ్రీస్వామి వారికి అంకితమివ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతులు మధుర కవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. సంప్రోక్షణ మహోత్సవాన్ని పురస్కరించుకొని కొండపైన ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొండపైన ఘాట్ రోడ్డులోని స్వాగత తోరణానికి ఇరువైపులా ఉన్న ఆధ్యాత్మిక రూపాలకు రంగులు వేశారు. ఉత్తర మాఢ వీధిలో ఉన్న రథశాల ఎదుట సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వేదికను ఏర్పాటు చేశారు.

స్వాతి నక్షత్రం రోజున ప్రారంభం..

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున ఉదయం ప్రధానాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు శత ఘటాభిషేక వేడుకను అర్చకులు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ ఉత్తర మాఢ వీధిలో ఏర్పాటు చేసిన పర్ణశాలలో పంచకుండాత్మక మహాయాగానికి శ్రీకారం చుట్టనున్నారు. 23వ తేదీన ఉదయం 9గంటలకు పర్ణశాలలో మహా పూర్ణాహుతి, వేదశాత్తుముర్రై వేడుకను పూర్తి చేస్తారు. అదే రోజు ఉదయం 11.54 గంటలకు స్వామి వారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ చేసి శ్రీస్వామి వారికి అంకితమిస్తారు.

ఐదు రోజులపాటు పూజలు

19వ తేదీన బుధవారం నుంచి ఐదు రోజులు పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 23వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, వేద శాత్తుముర్రై నిర్వహిస్తారు. ఉదయం 11.54 గంటలకు శ్రీస్వామి వారి బంగారు విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని జరిపిస్తారు. సాయంత్రం 4గంటలకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు. అదేవిధంగా పర్ణశాలలోని పంచకుండాల్లో 108 మంది రుత్వికులు వివిధ పూజలను జరిపించనున్నారు.

ఆదివారం వరకు సుదర్శన హోమం రద్దు

స్వర్ణ దివ్య విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నుంచి ఆదివారం (23వ తేదీ) వరకు ఆలయంలో నిర్వహించే శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని రద్దు చేసినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో వైకుంఠద్వారం

చంద్రపట్నం వేసి.. కల్యాణం జరిపించి..

ఘనంగా లింగమంతుల స్వామి, మాణిక్యమ్మ వివాహం

- పెళ్లిపెద్దలుగా మున్న, మెంతబోయిన వంశస్తులు
- పెద్దగట్టులో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ కవిత

సూర్యాపేట, చివ్వెంల, సూర్యాపేట టౌన్, భానుపురి : దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు మూడో రోజు భక్త జనులు పోటెత్తారు. ఉదయం కొద్దిగా తక్కువగా వచ్చిన మధ్యాహ్నం నుంచి భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. జాతరలో భాగంగా మంగళవారం చంద్ర పట్నం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు సంప్రదాయం ప్రకారం గుడి ప్రాంగణంలో శ్రీ లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ తంతును చూస్తూ భక్తులు ఓలింగా...ఓలింగా అంటూ భక్తి పారవశ్యంలో మునిపోయారు.



చంద్రపట్నం వద్ద యాదవ చరిత్రను వివరిస్తున్న బైకాన్లు

చంద్రపట్నం ప్రత్యేకత..

పెద్దగట్టు ఆలయం వద్ద మండపంలో బైకాన్లు వాయిద్యాలు వాయిస్తూ కథలు చెబుతూ చంద్రపట్నం వేసే ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఆ ప్రాంతంలో దీర్ఘచతురస్రాకారంలో చందనం చల్లారు. దీనిపై పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చ పిండి అద్ది 16 అడుగుల చంద్రపట్నం వేశారు. బైకానుల వాయిద్యాల మధ్య దేవరపెట్టెను తీసుకువచ్చి చంద్రపట్నంపై ఉంచారు. పట్నంపై రెండు పోలు ముంతలు పెట్టి చుట్టూ దారం చుట్టారు. వాటి ముందు రెండు మట్టి పాత్రలను పెట్టి నువ్వుల నూనె పోసి జ్యోతులు వెలిగించారు. తరువాత యాదవ కులస్తుల పుట్టుక చరిత్ర, లింగమంతులు, మాణిక్యమ్మల చరిత్రను కథల రూపంలో చెప్పారు. లింగమంతులస్వామి, మాణిక్యమ్మల అవసరమైన పట్టు వస్త్రాలు, పెళ్లి సామగ్రిని మెంతబోయిన వారు తీసుకు వచ్చారు. మాణిక్యమ్మ తరఫున మున్న వంశస్తులు, లింగమంతుల తరఫున మెంతబోయిన వంశస్తులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. బైకానులు పురోహితులుగా ఉండి చంద్రపట్నంపై ఉంచిన దేవరపెట్టెలో నుంచి లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల విగ్రహమూర్తులకు కల్యాణం జరిపించారు.

జాతరను సందర్శించిన ప్రముఖులు..



భేరీ మోగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

శ్రీ లింగమంతుల స్వామి జారతకు మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోనం ఎత్తుకొని వచ్చారు. బోనం అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిలు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లింగమంతులస్వామి ఆలయ పరిసరాల్లో మర్రిచెట్టు వద్ద భక్తుల రద్దీ

నేడు నెలవారం

జాతరలో భాగంగా నాలుగో రోజైన బుధవారం నెలవారం కార్యక్రమం నిర్వహించనున్నారు. కేసారం నుంచి పాలు తీసుకువచ్చి రెండు కొత్త బోనం కుండల్లో పోసి పొంగిస్తారు. అనంతరం మున్నవారు గొర్రెను బలిస్తారు. ఈ సందర్భంగా బైకాన్లు, బక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు. బలి ఇచ్చిన గొర్రెను బైకాన్లకు సగం, మెంతబోయిన వారికి సగం ఇస్తారు. అనంతరం ఆయా వంశీయులు ఆ మాంసం వండుకొని తినడం ఆనవాయితీ. ఇదే నెలవారం.


పెద్దగట్టు జాతరలో లింగమంతుల స్వామికి చంద్రపట్నం వేస్తున్న బైకాన్లు


చంద్రపట్నం మీద దేవరపెట్టెను పెడుతున్న దృశ్యం


జాతర పరిసరాలను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, డీఎస్పీ తదితరులు


స్వామి వారికి మొక్కుతున్న మహిళా పోలీసులు




రాత్రి వేళ స్వామివారిని దర్శించుకునేందుకు గట్టుపైకి వెళ్తున్న భక్తులు


పూజలు చేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

పెద్దగట్టుపై జన సందోహం

సూర్యాపేటటౌన్, చివ్వెంల: దురాజ్‌పల్లి లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో మూడో రోజు మంగళవారం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు 5లక్షల మంది భక్తులు లింగన్నను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతరలో వెలిసిన దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. గట్టుకు నాలుగు దిక్కులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్ద అత్యవసర చికిత్స అందించడమే కాకుండా.. మాస్కులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.


స్వామి దర్శనానికి క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

ఏరులై పారుతున్న మద్యం..

జాతరలో మద్యం ఏరులై పారింది. జాతరకు సమీపంలోనే రెండు వైన్స్‌లు నడుస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రతీ జాతరకు వైన్ షాపులు బంద్ చేస్తున్నా.. ఈసారి మాత్రం బంద్ చేయకపోవడంతో మద్యం ప్రియులు తాగి వచ్చి జాతరలో హంగామా చేస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణం..

పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు చేతులు ఎత్తేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో భక్తులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాతర పరిసరాలను 8 జోన్లుగా విభజించగా.. మొదటి రెండు రోజులు 400మంది పారిశుద్ధ్య సిబ్బంది మూడు షిఫ్టులుగా చెత్తాచెదారం శుభ్రం చేయగా.. మూడో రోజు పరిస్థితి దారుణంగా మారింది. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు కంపు కొడుతున్నాయని భక్తులు పేర్కొన్నారు.

పీకలపై పోలీసుల కొరడా..

జాతరలో కొంతమంది ఆకతాయిలు పీకలు కొని భక్తుల చెవుల దగ్గర ఊదుతూ ఇబ్బందులకు గురిచేస్తుండడంతో పోలీసులు పీకలు గుంజుకుని పగులగొట్టారు. వ్యాపారులను సైతం పీకలు విక్రయించొద్దని హెచ్చరించారు.

భక్తుల జేబులకు చిల్లు

జాతరలో కొబ్బరికాయలు, లడ్డూ ప్రసాదాలు, వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్స్, ఆట వస్తువులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తుల ఫిర్యాదు మేరకు అధికారులు హెచ్చరించడంతో కొంతసేపు టెండర్ ధరకు విక్రయించి ఆ తర్వాత మళ్లీ ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారని వాపోయారు. జాతర సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో సైతం టికెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయని భక్తులు మండిపడుతున్నారు.

స్వల్ప తోపులాట

సూర్యాపేట, భానుపురి: పెద్దగట్టు జాతరలో మంగళవారం రాత్రి స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. రాత్రి 7 గంటల సమయంలో భక్తులు ఎక్కువగా రాగా.. అదే సమయంలో ప్రధాన కంట్రోల్ పాయింట్ అయిన మర్రిచెట్టు సమీపంలోకి రెండు పారిశుద్ధ్య ట్రాక్టర్లు వచ్చాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండడం, ట్రాక్టర్లు అదే ప్రదేశంలోకి రావడంతో ఒత్తిడి పెరిగింది. చిన్నారులు, భక్తులు కొంత మేర ఇబ్బంది పడి ఒకరినొకరు స్వల్పంగా తోసుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించి భక్తుల రద్దీని నివారించారు.

పెద్దగట్టు అభివృద్ధికి రూ.14కోట్లు మంజూరు చేశాం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

చివ్వెంల: తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా వెలుగొందిన దురాజ్‌పల్లి లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.14కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేశామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం ఆమె లింగమంతులస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామి వారికి బోనం సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయానికి లింగమంతులస్వామి జాతర నిదర్శనమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పెద్దగట్టు ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జాతరలో అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఆమె వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య, నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


లింగమంతుడికి మొక్కుతున్న కవిత

క్లుప్తంగా

స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కౌశల్య యోజన కింద స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్‌ఎస్‌ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడున్నర నెలల కాల వ్యవధి కల్గిన బేసిక్ కంప్యూటర్స్ (డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్మీడియట్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, 4 నెలల కాలవ్యవధి గల సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ విద్యార్హత కల్గి ఉండాలన్నారు. అదేవిధంగా 5 నెలల కాలవ్యవధి కల్గిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ కల్గిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలన్నారు. హాస్టల్, భోజన వసతి కల్పించబడుతుందని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈ నెల 24న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు దిగుతుండగా ప్రయాణికుడుకి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ఆర్టీసీ బస్సు దిగుతుండగా కాలు పైనుంచి బస్సు టైరు వెళ్లడంతో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం రాజాపేట మండలం నెమిల గ్రామానికి చెందిన శీల రాజయ్య ఆర్టీసీ బస్సులో యాదగిరిగుట్టకు వస్తున్నాడు. బస్సు యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌కు రాగానే రాజయ్య బస్సు దిగుతుండగా.. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును ముందుకు పోనివ్వడంతో బస్సు టైరు రాజయ్య ఎడమ కాలు పైనుంచి వెళ్లింది. దీంతో అతడి ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. రాజయ్య కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసును నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

నేటి నుంచి స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనంతో ప్రారంభంకానున్నాయి. ఈ నెల 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మంగళవారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు తెలిపారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల కోసం విద్యుత్ దీపాలు, మామిడి, కొబ్బరి తోరణాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. 23వ తేదీన ఎదుర్కోలు ఉత్సవం, 24న కల్యాణోత్సవం, 25న పల్లకీ సేవ, 26న అశ్వ వాహన సేవ, 27న రథోత్సవం, 28న మహా సంప్రోక్షణతో ఉత్సవాలు ముగియనున్నాయి.


ముస్తాబైన స్వర్ణగిరి దేవాలయం

అధిక దిగుబడులపై దృష్టి సారించాలి

- భారతీయ వరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ మహేంద్రకుమార్

పెన్‌పహాడ్: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఖర్చు తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించే విధానాలపై దృష్టి సారించాలని భారతీయ వరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మహేంద్రకుమార్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలం దూపహాడ్, లింగాల గ్రామాల్లో భారతీయ వరి పరిశోధనా సంస్థ- రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్‌ఆర్ ఫండ్ సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి శాస్త్రవేత్తలు వరి పొలంలో ఏడబ్ల్యూడీ సెన్సార్ అమర్చినట్లు ఆయన తెలిపారు. ఏడబ్ల్యూడీ సెన్సార్ పరికరం ద్వారా వరి చేనులో నీళ్లు తక్కువగా ఉన్నప్పుడు, ఎక్కువగా ఉన్నప్పుడు రైతు మొబైల్‌కి మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు నీటి యాజమాన్య పద్ధతులు పాటించి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్, ఆదర్ష్, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ కవిరాజు, కల్టివేట్ సంస్థ సీఈఓ టి. మహేష్, ప్రాజెక్టు యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్, సాయికిరణ్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.


దూపహాడ్‌లో వరి పొలంలో ఏడబ్ల్యూడీ సెన్సార్లు అమర్చి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

సోషలిస్టు ఆర్థిక వ్యవస్థే ప్రత్యామ్నాయం

- ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

మిర్యాలగూడ: ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని అంతిమంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థే ప్రత్యామ్నాయమని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ హోటల్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వస్కుల సైదమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థతో కూడిన ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రపంచంలో ఏర్పడుతున్నాయన్నారు. ప్రధానమంత్రి మోదీ నియంతృత్వ పాలన చేస్తున్నారని ఆరోపించారు. జమిలి ఎన్నికలు, రైతు వ్యతిరేక చట్టాలు చేయడం, వక్ఫ్ ఆస్తులను వక్ఫ్‌బోర్డు నుంచి బయటకు తేవడం, ఎన్నికల సమయంలో పోల్ మేనేజ్‌మెంట్ చేస్తూ ఎన్నికల వ్యవస్థను పూర్తిగా దిగజార్చుతున్నారని విమర్శించారు. అమెరికా నుంచి భారతీయులకు బేడీలు వేసి ఇక్కడకు పంపిస్తున్నా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలంగా ఉందన్నారు. రానున్న కాలంలో దేశంలో, రాష్ట్రాల్లో కమ్యూనిస్టు వామపక్ష లౌకిక శక్తులను ఐక్యం చేయడానికి పనిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పోతుగంటి కాశీ, వనం నజీర్, పెద్దారపు రమేష్, ఎస్. రెడ్డి, హంసారెడ్డి, నర్రా ప్రతాప్, బాపురావు, కనకం సంధ్య, మాలోతు జబ్బార్‌నాయక్, తాండ్ర కళావతి, సావిత్రి, వెంకన్న, మేక మోహన్‌రావు, పోతుగంటి కాశీ, రాయబండి పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్

● ఇప్పుడు టీ టైం



వరంగల్‌కు చెందిన గణేష్, భైరవ, పరమేష్ పగటి వేషాలు వేస్తూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు పగటి వేషాలు వేసుకుని మంగళవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ అలసిపోయి అదే వేషధారణలో ఓ టీ దుకాణం వద్ద ఆగి టీ తాగి కాసేపు సేద తీరారు. స్థానికులు వారిని ఆసక్తిగా గమనించారు. వారం రోజుల పాటు ఇక్కడే ఉంటూ రోజుకొక వేషధారణలో భిక్షాటన చేస్తామని వారు చెప్పారు. – ఆత్మకూరు(ఎం)

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం

మిర్యాలగూడ టౌన్: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమయ్యాడు. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ ఎ. సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన కమ్మల కిష్టమ్మ కుమారుడు కొండలు(30)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. దీంతో కొండలుకు హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో కిష్టమ్మ నాలుగు నెలల పాటు చికిత్స చేయించింది. కొండలు ఈ నెల 8వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 17వ తేదీన మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిష్టమ్మ ఫిర్యాదు చేసింది. కొండలు తెల్లటి చొక్కా, ఖాకీ రంగు ప్యాంట్ ధరించాడని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కొండలు ఆచూకీ తెలిసిన వారు 8712670149, 9014555290 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.


కమ్మల కొండలు


చికిత్స పొందుతూ యువకుడు మృతి

హుజూర్‌నగర్‌రూరల్: కారు అదుపుతప్పి చెట్టు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 26వ తేదీన హుజూర్‌నగర్ మండల శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కట్టా భాస్కర్‌రావు మృతిచెందాడు. మృతుడి కుమార్తె హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటోంది. భాస్కర్‌రావు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఆమె తన కుమారుడు మక్కెన శ్రీనికేతన్(24), కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాసపురం గ్రామానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం అదే రోజు సాయంత్రం శ్రీనికేతన్ ఓ వ్యక్తితో కలిసి కారులో పక్క గ్రామానికి వెళ్లి వస్తుండగా.. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీనికేతన్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి మేనమామ కట్టా గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు మంగళవారం బంధువులు తెలిపారు.


శ్రీనికేతన్ (ఫైల్)

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బీబీనగర్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ భువనగిరి కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జయరాజు మంగళవారం తీర్పు వెలువరించారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామానికి చెందిన నిందితుడు శెట్టి శ్రీశైలం వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య తనకు దూరం కావడానికి, తన కుటుంబం చిన్నాభిన్నం కావడానికి అదే గ్రామానికి చెందిన శెట్టి పెదనర్సింహనే కారణమని భావించి అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2016 డిసెంబర్‌లో పెదనర్సింహ శ్రీశైలంను హత్య చేశాడు. పెదనర్సింహ కుమారుడు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీశైలంను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన భువనగిరి కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జయరాజు నిందితుడు శ్రీశైలంకు జీవిత ఖైదు, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.


నిందితుడు శ్రీశైలం

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చందంపేట: నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ వద్ద సాగర్ వెనుక జలాల్లో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన షేక్ గౌసొద్దీన్ 16న తన స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి వచ్చాడు. అక్కడ సాగర్ వెనుక జలాల్లోకి మర బోటులో వెళ్తుండగా.. గౌసొద్దీన్ జలాల్లో పడిపోయాడు. రెండు రోజులుగా గౌసొద్దీన్ కోసం వెతుకుతుండగా మంగళవారం మృతదేహం లభ్యమైనట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సతీష్ తెలిపారు. బోటు నడిపిన చింతకాయల రాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్షణికావేశం.. జీవితం కన్నీటిమయం

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామంలో ప్రతీకార హత్య కేసులో 18 మందికి జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం నల్లగొండ కోర్టు తీర్పు వెలువరించింది. నిందితులను పోలీసులు జైలుకు తరలించగా.. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.


రోదిస్తున్న నిందితుల కుటుంబ సభ్యులు


జీవిత ఖైదు పడిన అజీంపేట నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు


అజీంపేటలో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ సెక్యూరిటీ సూపర్‌వైజర్, జీతం: 16,500/- 8 గంటల డ్యూటీ, మేళ్ళచెరువు సిమెంట్ ఫ్యాక్టరీలో కావలెను. ఫ్రీ రూం, తక్కువ రేటుకు భోజనం. సంప్ర & 86884 17132, 90143 51804 [B-513]

■ శ్రీబాలాజీ హోంకేర్: Hydలో సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి (స్త్రీ/పు) కావలెను. జీ: 18000/- రూం+ మీల్స్ ఫ్రీ. & 95731 83331 [G-1940]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

Services

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6239]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.